


సిపిఎం నాయకుడు జగన్ ముందస్తు అరెస్టు

ప్రజాశక్తి-వేపాడ

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో సిపిఎం నాయకుడు చల్లాజగన్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఇటీవల ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పోలవరం (ఎడమ కాలువ) నిర్వాసితుల సమస్యల పైన, పెందుర్తి -బొడ్డవర హైవే నిర్వాసితుల సమస్యల పైన , వివిధ పైపులైన్లు, రైల్వే లైన్లు , గ్రీన్ ఫీల్డ్ హైవే బాధితుల సమస్యలను ముఖ్యమంత్రికి వివరించేందుకు సన్నద్ధమవు తున్నారని ముందస్తు అరెస్టుకు పాల్పడ్డారు. కొండగంగుపూడిలోని తన నివాసంలో గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. శు క్రవారం సాయంత్రం వరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉంచి తరువాత విడిచిపెట్టారు.



వల్లంపూడి పోలీసుస్టేషన్‌లో సిపిఎం నాయకుడు జగన్

సమాజానికి తోడ్పాటునివ్వాలి

- ప్రతి కుటుంబానికీ వైద్యం అందించడమే లక్ష్యం
- మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో సిఎం జగన్



వైద్య కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సిఎం జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గొప్ప వైద్యులుగా గుర్తింపు పొంది, సమాజానికి అంకిత భావంతో సేవలందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అకాంక్షించారు. ప్రతి కుటుంబానికీ వైద్యసేవలందిచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. విజయనగరం మెడికల్ కళాశాలను ప్రత్యక్షంగానూ, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల మెడికల్ కళాశాలలను వర్చువల్ పద్ధతిలోనూ శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం లెక్చర్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేస్తున్న ప్రభుత్వం మనదేనని అన్నారు. నెలకు రెండుసార్లు గ్రామాలకు పిహెచ్‌సి వైద్యులు వెళ్తారని, తద్వారా రానున్న 6 నెలల్లో పేదలకు మంచి వైద్యం అందించి ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని తెలిపారు. గ్రామాల్లో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు చేశామని, వాటి ద్వారా 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులతో సొంత ఊళ్లలోనే ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జిఎంపి, డబ్ల్యూహెచ్ఒ ప్రమాణాలు కలిగిన మందులు ఉచితంగా సరఫరా చేస్తున్నామన్నారు. తొలుత కలెక్టర్ నాగలక్ష్మి ప్రారంభోపన్యాసం చేశారు. వైద్య కళాశాలతో జిల్లా వాసులకు మరింతగా మెరుగైన వైద్యం అందడంతో పాటు విద్యార్థులకు రాష్ట్రంలో మొత్తం 2550 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని, దీనితో మరింత మంది పేద విద్యార్థులకు మేలు చేకూరుతుందని తెలిపారు. ఈ డిసెంబర్ నాటికి మొత్తం భవనాలు పూర్తవుతాయని తెలిపారు. 22 డిపార్ట్మెంట్లలో 174 పోస్టులు కూడా మంజూరయ్యాయని అన్నారు.



ప్రయోగశాలను పరిశీలిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రయోగశాలలను ఆసక్తిగా తిలకించిన సిఎం

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ ప్రయోగశాలలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తిలకించారు. ప్రొఫెసర్లు చెప్పిన విషయాలను విని, సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వైద్య కళాశాలలకు సంబంధించిన వివరాలను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విటి కృష్ణబాబు, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధరరెడ్డి సిఎంకు వివరించారు. అనంతరం సిఎం స్కిల్ ల్యాబ్‌ను సందర్శించారు. వివిధ వైద్య పరమైన అంశాలను ప్రొఫెసర్లు సిఎంకు ప్రయోగాత్మకంగా వివరించారు. సిఎం వెంట డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డిఎస్‌యుఎల్ నర్సింహం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ అప్పలనాయుడు ఉన్నారు.

సిఎంకు ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన సిఎం జగన్‌కు ఘన స్వాగతం లభించింది. సిఎం జగన్ తాడేపల్లి నుంచి విశాఖ వరకు విమానంలోను, విశాఖ నుంచి విజయనగరం జెఎన్‌టియు సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ హెలీక్యాప్టర్‌లోనూ చేరుకున్నారు. కలెక్టర్ నాగలక్ష్మి , ఎస్‌పి దీపికా, డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కొంతమంది నేతలు దుశ్శాలువలతో సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో ఎమ్మెల్సీలు సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, సంబంగి చిన వెంకట అప్పలనాయుడు, కంబాల జోగులు, పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, కళావతి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి. శంకరరావు, అవనాపు భావన, విక్రమ్, డిసిసిబి చైర్మన్ చిన రామునాయుడు, జిల్లా అధికారులు ఉన్నారు.

అనారోగ్య బాధితులకు రూ.4 లక్షల ఆర్థిక సాయం

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం విజయనగరం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న బాధితులు కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దారిద్ర్య రేఖకు దిగువ కుటుంబాలకు చెందిన వారమని వైద్యానికి, చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం కావాలని విన్నవించుకున్నారు. ఆయన బాధితుల సమస్యలను ఓపికగా విని వారితో కాసేపు మాట్లాడారు. వారిలో మనోధైర్యం నింపే ప్రయత్నం చేశారు. బాధితుల్లో ఒకరు ముఖ్యమంత్రిని చూడగానే బోరున విలపించగా వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి బాధితుడి భుజంపై చేయి వేసి ఓదార్చారు. మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైద్య కళాశాల ప్రారంభోత్సవం అనంతరం తిరుగు పయణంలో హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రిని గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పూసపాటిరేగ గ్రామానికి చెందిన చిన్నారి తోంపల లేఖన, గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన బోన్‌మేరో వ్యాధిగ్రస్థుడైన దూరి భానుప్రసాద్, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం దేరశం గ్రామానికి చెందిన పోలియో వ్యాధిగ్రస్థుడు పిల్లా శంకర రావు, అనుకోని ప్రమాదంతో వీల్ ఛైర్ కు పరిమితమైన సి. శిగడాం మండలం నిద్దాం గ్రామానికి చెందిన చౌదరి గణేశ్ కలిశారు. సహాయాన్ని అభ్యర్థించారు. స్పందించిన ముఖ్యమంత్రి ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున నలుగురికీ రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు.

దీంతో తక్షణమే ఆర్థిక సహాయం అందించేందుకు జిల్లా కలెక్టర్ తీవ్ర కృషి చేశారు. కలెక్టరేట్ ఎఒకు ఫోన్ చేసి నిమిషాల వ్యవధిలో చెక్కులు సిద్ధం చేయించి హెలీప్యాడ్ వద్దకు రప్పించారు. అక్కడికక్కడే ఆమె సంతకాలు చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించేందుకు ప్రయత్నించిగా... నీ చేతుల మీదుగానే ఇచ్చేయ్ తల్లి అని ముఖ్యమంత్రి చిరునవ్వుతో చెప్పారు. దీంతో బాధితులకు చెక్కులను అందజేశారు.



బాధితులతో మాట్లాడుతున్న సిఎం జగన్



విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారులు

అభివృద్ధిలో ఇంజినీర్లది ముఖ్యపాత్ర

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

దేశాభివృద్ధిలో ఇంజినీర్లది ముఖ్యపాత్ర అని జెడ్‌పిచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. భారతదేశ మొట్టమొదట ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా జాతీయ ఇంజినీర్స్‌డే వేడుకలు శుక్రవారం జెడ్‌పి సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్‌పి చైర్మన్ తొలుత విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పదంలో తీసుకెళుతున్న ప్రభుత్వంలో ఉన్న వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. ఈసందర్భంగా పలువురు రక్త దానం చేశారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జిఎస్ఎన్‌రాజు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదలశాఖ ఎస్ఇలు గుప్తా, ఉమాశంకర్, ఇఇలు నాయుడు, రమణరాజన్, ఇంజినీరింగ్ ఫోరమ్ నాయకులు గోవిందరావు, రమణప్రబాత్, దివాకర్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో

విజయనగరం టౌన్ : శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో ఇంజినీర్ల దినోత్సవాన్ని క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి క్లబ్ సభ్యులంతా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రమణ, క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు తదితరులు ఇంజినీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు వై. నలమరాజు, కోశాధికారి జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

'అవంతి'లో ఇంజినీర్స్‌డే వేడుకలు

డెంకాడ : స్థానిక అవంతి రీసెర్చ్, టెక్నాలజికల్ అకాడమీలో ఇంజినీర్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విజయనగరం బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.దాలి నాయుడుతో పాటు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి. జగదీష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య గారి జీవితంలో ముఖ్య ఘట్టాలను చెప్పి విద్యార్థులను ఎంతో ఉత్సాహపరిచారు. ఇంజినీర్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ ఎస్.రాఘవరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గోవిందరావు విద్యార్థులకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

లెండీ కళాశాలలో..

లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తరుణ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధి వి.స్వాతి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మధుసూదనరావు, ప్రిన్సిపల్ వివి రామరెడ్డి, సెక్రటరీ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో..

నెల్లిమర్ల : ప్రాజెక్టుల రూపశిల్పి, రాజనీతిజ్ఞుడుగా పేరుగాంచిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజున ఇంజినీర్స్‌డే జరుపుకోవడం ఆనందదాయకమని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. కె.మహంతి అన్నారు. శుక్రవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఇంజినీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య ను థియరీ తోపాటు ప్రయోగాత్మకంగా కూడా నేర్చుకున్నప్పుడే విద్యార్థులు ఎక్కువ ఉపాధి అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ ప్రస్తుతం ఇండస్ట్రీ 4.0లో ఉన్నామని, అందుకు తగిన విధంగా విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను అభ్యసించాలని అన్నారు. అనంతరం బ్రోచర్ ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. కె. మహంతి విడుదల చేశారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సన్నీడియోల్, డాక్టర్ ఎన్.వి.ఎస్. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

కొత్తవలస : ఇంజినీర్స్ దినోత్సవం సందర్భంగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జన్మదిన వేడుకలు ఘనంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కనీస సదుపాయాలు అలాగే సాంకేతిక పరిజ్ఞానం కూడా లేని కాలంలో ఎన్నో ఆనకట్టలు, పరిశ్రమలకు ఊపిరులూదిన గొప్ప దార్శనికులు అని అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బస్సుల్లేక వెలవెలబోయిన ఆర్‌టిసి కాంప్లెక్సు

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి పర్యటనకు శుక్రవారం అధిక సంఖ్యలో ఆర్‌టిసి బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. అరకొరగా ఉన్న బస్సుల వద్ద ప్రయాణికులు తోపులాడుకున్నారు. సిఎం పర్యటనకు జనాలను తరలించేందుకు బస్సులను కేటాయించడంతో ఈ పరిస్థితి నెలకొంది. గంటలు తరబడి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లో వేచి చూశారు.

కాలుష్య కోరల్లో బతకలేం

శ్రేయస్ పరిశ్రమ పైప్‌లైన్ పనులు అడ్డుకున్న కొణతాలపాలెం గ్రామస్తులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పరిశ్రమ వ్యర్థాల కోసం పైపులైన్లు ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు కాలుష్యమై తమ పంట పొలాలు నాశనం అవుతున్నాయని కొణతాలపాలెం గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చౌడువాడ పంచాయతీలో కొణతాలపాలెంగెడ్డలో నుంచి సముద్రం వరకు శ్రేయస్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న వ్యర్థ జలాల పైపులైను పనులను చౌడువాడ ఎంపిటిసి భర్త పసుపులేటి గోపి ఆధ్వర్యంలో కొణతాలపాలెం గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. గతంలో వేసిన వ్యర్థాల పైప్‌లైన్లు లీకై తమ ప్రాంతమంతా భూగర్భ జలాలు కలుషితమై తాగునీరు లేదని గ్రామస్తులు వాపోయారు. ఎంపిటిసి సభ్యులు సొంత నిధులతో కోనయ్యపాలెం నుండి మూడు కిలోమీటర్ల దూరంలోని తమ గ్రామానికి పైప్‌లైన్ ద్వారా నీరు అందిస్తున్నారని చెప్పారు. ఇప్పుడు మళ్లీ గెడ్డలో నుండి వ్యర్థాల పైప్‌లైన్లు వేస్తే తమ బతుకులు వీధిన పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పసుపులేటి గోపి మాట్లాడుతూ భారీ పైపులైను గ్రామ సమీపంలో వేయడం వల్ల గ్రామమంతా ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలు భూగర్భ జలాలను కలుషితం చేసి, కనీసం తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయలేకపోవడం విచారకరమన్నారు. గెడ్డ మీదుగా రహదారి వేయాలని చూస్తే ఇప్పటికే కోర్టులో స్టే కూడా తెచ్చి నిలుపుదల చేశామన్నారు. ఇప్పుడు మళ్లీ వ్యర్థాల కోసం పైపులైను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. గ్రామస్తుల ఆందోళనతో పైప్‌లైన్ పనులను నిర్వాహకులు ఆపేశారు. దీంతో గ్రామస్తులంతా వెనుదిరిగారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు కోరాడ రమణ, మొంగం మోహన్ రావు, గ్రామస్తులు కొణతాల అప్పలనాయుడు, సురేష్, అప్పయ్యమ్మ, రాములమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



పైప్‌లైన్ పనులు అడ్డుకుంటున్న కొణతాలపాలెం గ్రామస్తులు



డెంకాడ మండలాధ్యక్షులు వాసుదేవరావుకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు

వైసిపి మండలాధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-డెంకాడ

వైసిపి మండల, పట్టణ అధ్యక్షులను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పలు మండలాలతోపాటు బొబ్బిలి, నెల్లిమర్ల పట్టణాల అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు ఆ పార్టీ వెల్లడించింది. మండలాల వారీగా అధ్యక్షుల వివరాలు...

మండలం, పట్టణం	నూతన అధ్యక్షులు
బాడంగి	బొమ్మినేని వెంకటనాయుడు
బొబ్బిలి టౌన్	చోడిగంజి రమేష్‌నాయుడు
బొబ్బిలి	ఉత్తరావెల్లి అప్పలనాయుడు
రామభద్రపురం	అప్పికొండ లక్ష్మణనాయుడు
తెర్లాం	తెంటు సత్యంనాయుడు
చీపురుపల్లి	ఇప్పిలి అనంతం
గరివిడి	కొణిసి కృష్ణంనాయుడు
గుర్ల	జమ్ము స్వామినాయుడు
మెరకముడిదాం	కోట్ల వెంకటనాయుడు
బొండపల్లి	బొద్దల చిన్నంనాయుడు
దత్తిరాజేరు	రాపాక క్రిష్ణమూర్తి
గజపతినగరం	బూడి వెంకటరావు
గంట్యాడ	రంజి రామినాయుడు
జామి	గొర్లె రవికుమార్
భోగాపురం	ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి
డెంకాడ	బంటుపల్లి వాసుదేవరావు
నెల్లిమర్ల	చనుమళ్ల వెంకటరమణ
నెల్లిమర్ల టౌన్	చిక్కాల సాంబశివరావు
పూసపాటిరేగ	పతివాడ అప్పలనాయుడు
లక్కవరపుకోట	గుమ్మడి సత్యనారాయణ

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులకు బెదిరింపులు
- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు దౌర్జన్యంగా కబ్జా చేసి నకిలీ పత్రాలను సృష్టించి నిర్మాణాలు జరుపుతున్నారు. స్థానిక డైట్ కాలనీ నెల్లిమర్ల - విజయనగరం ప్రధాన రహదారి పక్కన సర్వే నెంబర్ 65/3లో సుమారు 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని అధికారులు గాయ్యాలుగా గుర్తించినప్పటికీ కొంత మంది అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారు. ఇదే స్థలాన్ని గతంలో ఒక వ్యక్తికి డి- పట్టా మంజూరు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. కాగా ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేసానని చెబుతూ ఒక వ్యక్తి దౌర్జన్యంగా తన వద్ద ఎటువంటి ఆధారాలూ లేకపోయినప్పటికీ నిర్మాణం చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి నాలుగు నెలలు క్రితం నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. అయితే వారం రోజులు క్రితం మళ్లీ అదే భూమిని సదును చేసి అక్రమంగా అదే వ్యక్తి నిర్మాణం చేపడుతున్నారు. నెల్లిమర్ల- విజయనగరం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విలువైన భూమి కావడంతో దీనిపై కన్నేసిన సదరు వ్యక్తి రాజకీయ నాయకుల అండదండలతో అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారు. పైగా నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆదేశించిన రెవెన్యూ అధికారులపై తిరిగి బెదిరింపులకు తెగబడినట్లు తెలిస్తోంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్థానిక పోలీసు స్టేషన్‌లో సదరు కబ్జాదారులపై ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కాగా నగర పంచాయతీలో 1400 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చింది గాని 3 సంవత్సరాలు దాటిన ఇంతవరకు స్థలం చూపించ లేదు. సరికదా ప్రభుత్వ భూములు అక్రమార్కుల చెరలోకి వెళ్తున్నా పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

పోలీసులకు ఫిర్యాదు చేశాం

సర్వే నెంబర్ 65/3లో ఉన్న సుమారు 60 సెంట్ల స్థలాన్ని గాయ్యాలు భూమిగా గుర్తించాం. ఈ స్థలంలో డి -పట్టా మంజూరు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే ఎవరి పేరునైతే డీ-పట్టా మంజూరైందో ఇప్పుడు అతను లేడు. ఇదే స్థలాన్ని డైట్ కాలనీకి చెందిన ఒక మహిళ తాను కొనుగోలు చేశానని చెబుతూ దౌర్జన్యంగా నిర్మాణం చేపడుతుంది. దీంతో మా సిబ్బంది వెళ్లి అడ్డుకోగా మహిళ సిబ్బందిపై దుర్భాసలాడుతూ ఎదురు దాడి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెకు నోటీసులు ఇచ్చి పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాం. డి-పట్టా భూములను అమ్మకాలు, కొనుగోలు చేయకూడదని చెప్పినా ఆమె మమ్మల్నే బెదిరిస్తోంది.

- శైలజ, తహశీల్దార్

మరణంలోనూ వీడని బంధం

- భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య మృతి
- ఎరుకొండ గ్రామంలో ఘటన

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మూడుముళ్ల బంధంతో వారిద్దరూ ఒక్కటయ్యారు. సంసారనౌకలో ఆప్యాయంగా పయనించారు. అన్యోన్యంగా జీవించారు. కన్నబిడ్డలు ఐదుగుర్నీ కంటిపాపల్లా పెంచి పెద్ద చేశారు. ఇంతలో వృద్ధాప్యం వారిని పలకరించింది. గుండెపోటుతో భర్త మృతిచెందడంతో తట్టుకోలేక కొద్దిగంటల వ్యవధిలో భార్య కూడా తనువు చాలించింది. ఈ సంఘటన మండలంలోని ఎరుకొండ గ్రామంలో చోటుచేసుకుంది.

మండలంలోని ఎరుకొండ గ్రామానికి చెందిన బలగం నారాయణరావు (65) గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గుండెపోటుతో మృతి చెందారు. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య బలగం సూర్యం (60) గురువారం రాత్రి 12 గంటల సమయంలో తుదిశ్వాస విడిచింది. వారికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ గంటల వ్యవధిలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.



మృతిచెందిన దంపతులు

తాగునీటి రిజర్వాయర్ల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని బిసి కాలనీ, కెఎల్‌పురం, ధర్మపురిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న రిజర్వాయర్ల పనులు ప్రజారోగ్య సాంకేతిక శాఖ పర్యవేక్షక ఇంజినీర్ పి.గణపతిరావు పరిశీలించారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనుల టెండర్లు త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ కె.శ్రీనివాస రావు, ఇఇ కె.దక్షిణమూర్తి, టెక్నికల్ ఆఫీసర్ కె.ఫణికుమార్, డిఇఇలు వి.జగన్ మోహన్, ఎస్.అప్పారావు, సిహెచ్ చంద్రమౌళి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ గణపతిరావు

జనసేన నాయకులు అరెస్టు

విజయనగరం టౌన్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన నే పథ్యంలో జనసేన నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పలువురిని అదుపులోకి తీసుకొని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. జనసేన నాయకులు గురాన అయ్యలు మాట్లాడుతూ శాంతియుతంగా చేస్తున్న నిరసనలను పోలీసుల సాయంతో రాష్ట్ర ప్రభుత్వం అణిచివేయడం దురదృష్ట కరమని పేర్కొన్నారు. అరెస్టు అయిన వారిలో పాలవలస యశస్వి, పడాల అరుణ, తుమ్మిలక్ష్మీ, మాతా గాయిత్రి తదితరులు ఉన్నారు.



రోడ్డు నిర్మించుకుంటున్న మారిక గిరిజనులు

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గ్రామానికి గిరిజనులు శ్రమదానంతో రహదారి నిర్మించుకుంటున్నారు. దశాబ్దాలుగా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన గిరిజనులు శ్రమదానం ద్వారా రోడ్డు బాగుచేసుకుంటున్నారు. కరకవలస పంచాయతీ కేంద్రానికి మారిక గిరిజన గ్రామం పది కిలోమీటర్ల దూరంలో కొండలపై ఉంది. రోడ్డు నిర్మాణం కోసం ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా రూ.6 కోట్లు నిధులు మంజూరయ్యాయి. సుమారు పదేళ్లు కావస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. మైదాన ప్రాంతంలో రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కొండపైన నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణం కోసం డొంకలు, బండ రాళ్లు తొలగించి మధ్యలో పనులు నిలిపివేశారు. దీంతో అత్యవసర సమయాల్లో గిరిజనులే డోలీ మోతతో రోగులను, గర్భిణులను కిందికి తీసుకొచ్చేవారు. ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు గిరిజనులు వినతులు అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో గిరిజనులే స్వయంగా సుమారు మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు పనులు పూర్తి చేసేందుకు సంకల్పించారు.

హక్కుల కోసం పోరాడుతాం

ప్రజాశక్తి-విజయనగరంకోట

మీ గురించి, మీపిల్లల గురించి పోరాడే ఏకైక సంస్థ చైల్డ్ రైట్స్ ఫోరం మీ పిల్లల హక్కులు గూర్చి పోరాడే ఏకైక సంస్థ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం అని జిల్లా కన్వీనర్ సత్తి అచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హక్కులకు భంగం కలిగితే తన నెంబర్ 9440114346కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. యూనిఫారం వేసుకోలేదని, ఫీజుకట్టలేదని పిల్లలను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. పిల్లలను కంటికి రెప్పలా పాఠశాలలో చూసుకోవాలని తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు రెండో విడత పనులను ఎంఇఒ పి.బాల భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, నాణ్యతాలోపం ఉండరాదని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని మొయిద రైతు భరోసా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను శుక్రవారం నాబార్డు డిజిఎం టి.నాగార్జున సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న సేవలు, కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు పంపిణీ, ఇ-పంట నమోదు పరిశీలించారు. ల్యాబ్‌లో జరిగిన విత్తనాలు, ఎరువుల పరీక్షల ప్రక్రియ పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌సి వ్యవసాయ అధికారి టి.సంగీత, వ్యవసాయ అధికారులు ఎం.పూర్ణిమ, పి.శ్రీలక్ష్మి, ఎఇఒ ఎం.నాగరాజు, దామోదర్, భవాని, విఎఎ నిఖిల పాల్గొన్నారు.

సర్వే రాళ్లు ఏర్పాటు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఇంతవరకు సమగ్ర భూ సర్వే నిర్వహించిన భూములకు హద్దులు నిర్ధారిస్తూ సర్వే రాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియను శుక్రవారం బానాది, జగ్గయ్యపేట, తదితర గ్రామాల్లో సర్వే శాఖ ఎడి త్రివిక్రమరావు, తహశీల్దార్ ప్రసన్న కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో డిటి సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, గ్రామ సర్పంచ్ కర్రి యశోద పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి సన్యాసినాయుడు

క్రీడలతో మానసిక ఉల్లాసం

మెంటాడ : క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. మండలంలోని చల్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, తెట్టంగి దుర్గ, లెంక రత్నాకర్‌నాయుడు, మెంటాడ పిఎసిఎస్ అధ్యక్షులు తాడ్డి రామచంద్రరావు, ఎంఇఒలు కె.మోహన్‌రావు, యువిఎస్ వర్మ పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

వేపాడ : మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరాయి సర్పంచ్ ఎన్.వెంకటరావు. అరిగిపాలెం ఎంపిటిసి టి.వి.రమణ, నాయకులు సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి కన్నమనాయుడు పాల్గొన్నారు.

19న రేగిడి మండల సమావేశం

రేగిడి : ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామలకుమారి తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది



బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న సర్పంచ్

డెంకాడ : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని సర్పంచ్ లంక లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని పినతాడివాడ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు ఎల్.శర్మ, గీతకుమారి, బి.కృష్ణకుమారి, ఎస్.రవికుమార్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని, పనిచేసిన చోట గుర్తింపు తెచ్చుకోవడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి వి.అచ్చెన్నాయుడు హెచ్‌ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్‌ఒ రమేష్ మృతికి సంతాపం

బొబ్బిలి : సాలూరు మున్సిపల్ ఆర్‌ఒ టి.రమేష్ మృతికి కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలిపారు. నిజాయతీగా పని చేసిన ఆర్‌ఒ రమేష్ మరణం ఎంతో బాధగా ఉందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో పని చేసిన సమయంలో అందరితో సరదాగా ఉండేవారని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

టిడిపి నాయకుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం కోట

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు చేపట్టిన నిరసన దీక్ష మూడోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. స్థానిక అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయం వద్ద నల్ల కండువాలు వేసుకొని నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా ఫెక్సీపై ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని విడుదల చేసే వరకు ఈ నిరసన దీక్షలు కొనసాగుతాయని అన్నారు. మోసపూరితమైన కుట్ర అందులో భాగంగానే అరెస్ట్ చేశారని అన్నారు. రాష్ట్రంలో 144 సెక్షన్ అమలు చేస్తున్న పోలీసులు వైసిపి బైక్ ర్యాలీకి ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, ధర్మరాజు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, శ్రీనివాసరావు, రొంగల రామారావు, కర్రోతు నర్సింగరావు, వి.ప్రసాద్, కోదండరాం, రాజు, భారత్,, ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు. **బొబ్బిలి** పట్టణంలో తెలుగు యువత చేపట్టిన సామూహిక నిరాహార దీక్షను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయనతో కలిసి ఎమ్మెల్సీ చిరంజీవిరావు ప్రారంభించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు ప్రతీకారంగా ఓటుతోనే వైసిపికి బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ చిరంజీవిరావు కోరారు. **చీపురుపల్లి** మండల కేంద్రంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున అధ్యక్షన చేపట్టిన దీక్షలో శుక్రవారం మెరకముడిదాం మండల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓ అభిమాని శిబిరం వద్దే అరగుండు చేయించుకుని ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశాడు. దీక్షలో నాయకులు తాడ్డి సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ్, మండల రమణమోహన్‌రావు, పెందుర్తి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు. **శృంగవరపుకోట** పట్టణంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యాన మూడో రోజు దీక్షలు కొనసాగాయి. ధార గంగమ్మ ఫంక్షన్ హాలు వద్ద నియోజకవర్గ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యాన దీక్ష చేపట్టారు. ఈ శిబిరాలను సిపిఐ నాయకులు పి.కామేశ్వరరావు, మద్ది కృష్ణ, మోపాడ మధు సందర్శించి, మద్దతు తెలిపారు.



విజయనగరంకోట.. టిడిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజలే బుద్ధి చెప్తారు

మాజీ ఎమ్మెల్యే గీత

విజయనగరంకోట : రానున్న రోజుల్లో ప్రజలే వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని మాజీ ఎమ్మెల్యే మీసాలగీత అన్నారు. శుక్రవారం 'బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర కల్పవల్లి పైడితలమ్మను దర్శించుకొని చంద్రబాబు నాయుడు క్షేమంగా బయటకు రావాలని, నూటొక్క కొబ్బరికాయ కొట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కక్షపూరిత వైసిపి ప్రభుత్వం అంతం అవ్వాలని, తమ అధినేత త్వరగా ఈ అభియోగాల నుండి బయటకు రావాలని కోరారు. వైసిపి నాయకులకు 144 సెక్షన్ వర్తించదా అని ప్రశ్నించారు. అనంతరం మూడులంతర్ల దగ్గర గల జామియా మసీదులో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు తుంపిల్లి రమణ, మండల మాజీ ప్రధాన కార్యదర్శి దాట్ల రవి రాజు , రాష్ట్ర పద్మశాలి కన్వీనర్ దేవేంద్రనాథ్ , మాజీ కౌన్సిలర్లు కెల్ల సూరిబాబు, సుంకరి విజయలక్ష్మి , కిలాన మహేష్ , గోగుల ప్రణయి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

గాజులరేగలో నూతనంగా ఏర్పాటు అయిన ప్రభుత్వ వైద్యకళాశాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. సిఎంకు సంఘీభావంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు నగరంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తన స్వగృహం వద్ద ఈ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో వేలాదిమంది కార్యకర్తలు పాల్గొని థాంక్యూ సిఎం సార్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. పురవీధుల గుండా సాగిన బైక్ ర్యాలీ గాజులరేగలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్దకు చేరింది.

వైసిపిది అరాచక పాలన : జనసేన

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన సాగిస్తోందని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. శుక్రవారం పట్టణంలో వైసిపి అరాచక పాలనకు స్వస్తి పలకాలని నల్ల బెలూన్లు, జనసేన-టిడిపి పొత్తుకు స్వాగతం పలుకుతూ తెల్ల బెలూన్లు ఎగురవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించి, జనసేన-టిడిపి కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంగాధర్, సతీష్, గణపతి, రమ్య, జగన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్‌తో నాణ్యమైన వైద్య సేవలు



వంగర.. మాట్లాడుతున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షపై శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్షపై ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. మున్సిపాలిటీలో వచ్చేనెల 6న గొల్లపల్లి, 13న సంఘవీధి, 27న ఇందిరమ్మ కాలనీ అర్బన్ హెల్త్ ప్రైమరీ సెంటర్ వద్ద నిర్వహించే వైద్య శిబిరాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్‌ఒ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ భానోజీరావు ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య సురక్ష మండల కన్వీనర్ సిహెచ్ రామసూర్యం, సిడిపిఒ ఉమాభారతి, వైద్యులు జగదీశ్వరరావు, వెంకటేష్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంఇఒ వెంకటరావు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఎంఇఒ బాలభాస్కర్, వైద్యాధికారి ధరణి మాట్లాడుతూ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు.

వంగర : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి యు.సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శశిభూషణరావు, తహశీల్దార్ డి.ఐజాక్, వైసిపి మండల నాయకులు కరణం సుదర్శనరావు, వైద్యాధికారులు సుస్మిత దయానా, జ్యోతి పాల్గొన్నారు.

లక్కవరపుకోట : సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపిపి గేదెల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని చందలూరు పంచాయతీలో జెసిఎస్ మండల కన్వీనర్ యడ్ల కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు, పిహెచ్‌సి వైద్యాధికారి పివి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : గ్రామాల్లో ఆరోగ్య సురక్ష సర్వే పక్కాగా జరగాలని మండల ప్రత్యేకాధికారి వి.శ్రీనివాసరావు సూచించారు. రామతీర్థం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంచరావు రాము, హౌసింగ్ జెఇ ఆర్.పవన్ పాల్గొన్నారు.



గంట్యాడ.. మాట్లాడుతున్న ఎంపిపి హైమావతి

జీవనాధారం ఎలా?

కెవికె ఏర్పాటుపై పునరాలోచించాలని వినతి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

చిన్నచామలాపల్లి రెవెన్యూ పరిధిలో డి-పట్టా భూముల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుపై పునరాలోచించాలని సర్పంచ్ మజ్జి భారతమ్మ, ఆధ్వర్యాన గ్రామస్తులు తహశీల్దార్‌కు వినతి అందించారు. తమ గ్రామానికి అనుకొని ఉన్న సర్వే నెంబర్ ఒకటిలో డి-పట్టా భూముల్లో రైతులు మామిడి, జీడి తోటలను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గొర్రెలు, మేకల పెంపకమే జీవనాధారమని తెలిపారు. ఆయా భూముల్లో కృషి విజ్ఞాన కేంద్ర భవన నిర్మాణాలు చేపడితే జీవనాధారం కోల్పోతామని రైతులు, పెంపకందారులు వాపోయారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీకాంత్, మాజీ ఎంపిటిసి ఎం.ఎరుకునాయుడు, వైస్ సర్పంచ్ బమ్మిడి శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాన్ని సిపిఎం నాయకులు రాకోటి రాములు సందర్శించి, రైతులతో మాట్లాడి, సమస్యను తెలుసుకున్నారు. రైతులు, గొర్రెలు, మేకల పెంపకం దారులకు జీవనాధారమైన భూముల్లో కెవికె ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అధికారులు పునరాలోచించి, మరోచోట కెవికె ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు.

తెగుళ్లపై అప్రమత్తం

ప్రజాశక్తి-రేగిడి

వరి పంటలో కుళ్లి తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ మురళీకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని చాటాయివలస గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని సర్పంచ్ కరణం గోవిందరావు పొలంలో నిర్వహించారు. కుళ్లి తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు ఎఒ వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి పొగిరి అప్పలనాయుడు, ఎల్టు గౌరీశ్వరరావు, విఎఎ శ్రీనివాసరావు, ఐసిఆర్‌పి పైలా తవిటినాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి రైతు వ్యవసాయ పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ డి.భారతి అన్నారు. శుక్రవారం కారాడ గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో పాల్గొని ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానంగా ఈసా విధానాన్ని రైతులతో చేయించారు. గ్రూపులుగా పొలంలోకి దిగి కనీసం ఐదు వరి దుబ్బులను పరిశీలించి వాటిపై ఉన్న మిత్ర, శత్రు పురుగులు, వాతావరణం, నీటి వంటి పరిస్థితులను గమనించారు. వాటిని ఒక చార్టుపై రాసుకొని ఎటువంటి చర్యలు చేపట్టాలో రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎడి ఎం.శ్యామసుందర్, విఎఎ ఎం.సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల చేతుల్లోనే డి-పట్టా భూములుండాలి

ప్రజాశక్తి-రేగిడి

డి పట్టా భూములు లబ్ధిదారుల చేతుల్లోనే ఉండాలని, అమ్మకాలు చేపడితే స్వాధీనం చేసుకుంటామని ఆర్‌డిఒ అప్పారావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తునివాడ గ్రామంలో గతంలో ఇచ్చిన డి పట్టా భూములు లబ్ధిదారుల చేతిలో ఉన్నాయా? లేవా? అని ఆయన తనిఖీ చేశారు. రెవెన్యూ అధికారులు సమర్పించిన జాబితాను పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ టి.కళ్యాణి చక్రవర్తి, డిఐ ఒ రాజేశ్వరరావు, మండల సర్వేయర్ మహేష్, విఆర్‌ఒ మధు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



డి పట్టాలు పరిశీలిస్తున్న ఆర్‌డిఒ అప్పారావు

'సాధన' సభ్యుల ఔదార్యం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సాధన యువజన సంఘం సభ్యులు ఔదార్యాన్ని చాటుకున్నారు. విజయనగరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో ఓ వ్యక్తి గుండె శస్త్రచికిత్స నిమిత్తం నాలుగు యూనిట్ల లైవ్ బ్లడ్ అవసరం కావడంతో సాధన యువజన సంఘానికి సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో వెంటనే అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ స్పందించడంతో సభ్యులు నల్లి రాధాకృష్ణ, బుగత గిరి స్థానిక రోటరీ బ్లడ్‌బ్యాంకులో రక్తదానం చేశారు. రక్తదాతలను పలువురు అభినందించారు.

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి-రామభద్రపురం

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని నాయుడువలస సర్పంచ్ లక్ష్మి కోరారు. రోటరీ క్లబ్ బొబ్బిలి పట్టణ అధ్యక్షులు జెసి రాజు అందజేసిన మట్టివినాయక ప్రతిమలను శుక్రవారం సర్పంచ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు రెడ్డి వేణు, రాజశేఖర్, శివున్నాయుడు, రవికుమార్, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రతిఒక్కరూ కాలుష్య రహిత వినాయక చవితి జరుపుకోవాలని జన విజ్ఞాన వేదిక సభ్యులు కోరారు. శుక్రవారం అలజంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద జెవివి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవివి బొబ్బిలి మండల అధ్యక్షులు శంబంగి.శ్రీనివాసరావు, కృష్ణదాస్, మోజస్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి పంపిణీ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యు.ఎన్.శర్మ, కోశాధికారి బి.త్రిమూర్తులు, జియో వ్యవస్థాపకులు బి.రామకష్ణ, కోర్టు సూపరింటెండెంట్ వి.సంపత్ కుమార్, కె.శ్రీనివాసరావు, కె.విజయలక్ష్మి పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్.. మట్టివినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న జెవివి సభ్యులు

పర్యావరణ హితంగా వినాయకచవితి

విజయనగరం : నీటిలో సులభంగా మట్టి విగ్రహాలను మాత్రమే పూజకు వినియోగించడం ద్వారా పర్యావరణహిత వినాయకచవితిని జరుపుకుందామని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గణేశ్ నవరాత్రి వేడుకల సందర్భంగా పర్యావరణానికి హాని కలగని రీతిలో వినాయక చవితిశ్రీతీ ఆనందోత్సాహాలతో జరుపుకొనేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పలు సూచనలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రూ.10 లక్షలు టర్నోవర్ దాటితే పన్ను

ప్రజాశక్తి-కొత్తవలస

రూ.10 లక్షల టర్నోవర్ దాటిన వ్యాపారులు వృత్తి పన్ను చెల్లించాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ జి.అచ్చయ్య తెలిపారు. శుక్రవారం కొత్తవలసలోని ప్రయివేటు కల్యాణ మండపంలో వ్యాపారులు, జిఎస్‌టి ప్రాక్టిషనర్స్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిఎస్‌టి రిటర్న్లు నిర్ణీత సమయంలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో డిసిటిఒ వెంకటేశ్వర రావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ తాత బాబు, సెక్రటరీ విన్నకోట గౌతమ్, వైస్ ప్రెసిడెంట్ కొల్లా విజయ్, కోశాధికారి రేపాక శ్రీనివాస్, అకౌంటెంట్స్ మధు, రమణ, శ్రీనివాస్, సుదర్శన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎసి అచ్చయ్య



బీమా సాయాన్ని అందజేస్తున్న నాయకులు

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-మెరకముడిదాం


మండలంలోని గర్భాం గ్రామానికి చెందిన వలిరెడ్డి శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. శ్రీనివాసరావు భార్య వలిరెడ్డి గౌరికి వైఎస్‌ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఎంపిపి తాడ్డి క్రిష్ణవేణి, వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు అందజేశారు.

ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని సచివాలయం-2 పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన వ్యత్యాసాలు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు మోపాడ కుమార్, పుణ్యగిరి ట్రస్ట్ చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ, పోతనపల్లి వెంకటరావు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి వాకాడ సతీష్ పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లోచర్లలో పోషకాహార మహోత్సవం

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని లోచర్ల అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ పోషకాలు విలువలు గల ఆహార పదార్థాలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాల ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.